# ప్రశాంతంగా ముగిసిన డైట్ కౌన్సిలింగ్

**ప్రజాశక్తి- కార్వేటినగరం:** జిల్లా విద్యా శిక్షణాసంస్థలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన డైట్ రెండో విడత కౌన్సిలింగ్ బుధవారం ప్రశాంతంగా ముగిసిందని సూపరింటెండెంట్ కపావతి తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలుగు రోజుల పాటు నిర్వహించిన కౌన్సిలింగ్‌కు వివిధ జిల్లాల నుంచి వచ్చిన 22 మంది అభ్యర్థుల ఓరిజినల్ సర్టిఫికేట్లను పరిశీలించి ఆన్‌లైన్‌లో నగదు చెల్లించిన వారిని వారు ఎంపిక చేసుకున్న కళాశాలలకు ప్రవేశపత్రాలను అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఇళంగోవన్, దేవాప్రసాద్, జూనియర్ సహాయకులు పరుషోత్తం పలువురు పాల్గొన్నారు.

# నిర్మాణాల్లో నాణ్యత కరువైతే చర్యలు తప్పవు

## విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలి : కలెక్టర్



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం. హరినారాయణన్

**ప్రజాశక్తి- గంగవరం:** విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన భోజనాన్ని అందించేందుకు ప్రభుత్వం మెనూను నిర్దేశించడం జరిగిందని, ఈ మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ యం. హరి నారాయణన్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టర్ క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ట్రైనీకలెక్టర్ వై.మేఘస్వరూప్‌తో కలసి గంగవరం మండలంలో పర్యటించి ప్రభుత్వ అభివద్ధి కార్యక్రమాల పురోగతి తీరును పరిశీలించారు. పర్యటనలో భాగంగా పసుపుత్తూరులో నిర్మాణ పనులు జరుగుతున్న రైతు భరోసాకేంద్రం, వైఎస్ఆర్ హెల్త్‌క్లినిక్ నిర్మాణ పనులను, పత్తికొండ జడ్పీ హైస్కూల్ నందు రెండో విడతలో నాడు- నేడు పనులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్వాడీ సెంటర్‌లను తనిఖీ చేశారు. అనంతరం పెద్దనపల్లిలో ఎంపీ మోడల్ ప్రైమరీ స్కూల్‌లో మధ్యాహ్న భోజనం కీలపట్లలో రీసర్వే పనుల పురోగతిని పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో పలు సంస్కరణలు తీసుకురావడం జరిగిందని ఇందులో భాగంగా విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం సౌకర్యం కల్పించాలని సూచించారు. మెనూ ప్రకారం నేడు వెజిటబుల్ రైస్, ఎగ్, చిక్కి విద్యార్థులకు వడ్డిస్తుండగా ఆ భోజనాన్ని కలెక్టర్ రుచి చూసి మరింత రుచికరంగా విద్యార్థులకు భోజనాన్ని సిద్ధం చేయాలని నిర్వాహకులకు సూచించారు. జగనన్న విద్యా కానుక కిట్లు అందరికీ అందాయా లేదా అని కలెక్టర్ ప్రశ్నించగా అందరికీ అందాయని విద్యార్థులు తెలిపారు. జడ్పీ హైస్కూల్‌లో రెండోవిడత నాడు- నేడులో భాగంగా 10కాంపోనెంట్ల కింద రూ.42లక్షల అంచనావ్యయంతో జరుగుతున్న పనులను నాణ్యతతో పూర్తిచేయాలని ఆదేశించారు. అనంతరం పత్తికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి ప్రధానమంత్రి సురక్షిత మాతత్వ అభియాన్ కింద గర్భిణులకు అందిస్తున్న వైద్యసేవల గురించి మెడికల్ ఆఫీసర్‌ను వివరాలు అడిగారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంను తనిఖీ చేసి ఈ కేంద్రాలకు వచ్చే పిల్లలకు మంచి పౌష్టికాహారంను అందించాలని, ఆటపాటలతో విద్యను పరిచయం చేయాలని సూచించారు. తదుపరి కీలపట్లలో జరుగుతున్న రీ సర్వే ప్రక్రియను పరిశీలించి రీసర్వేకు సంబంధించి రైతులకు అవగాహన కల్పించి రీసర్వే పనులు పూర్తి చేయాలన్నారు. గంగవరం మండలంలో మూడు గ్రామాలు కీలపట్ల, కలగటూరు, కల్లుపల్లి రీసర్వేకి ఎంపిక కాగా కీలపట్లలో 27.6 కిలోమీటర్ల విలేజ్ బౌండరీకి గాను 17 కిలోమీటర్ల పూర్తి చేయడం జరిగిందని, కలగటూరులో 13.10 కిలోమీటర్ల విలేజ్ బౌండరీ పూర్తి చేయడం జరిగిందని, కల్లుపల్లి నందు 15.70 కిలోమీటర్ల విలేజ్ బౌండరీ పూర్తి చేయడం జరిగిందని డిఐ రవిచంద్ర కలెక్టర్‌కు వివరించారు. ఈ పర్యటనలో జిల్లాకలెక్టర్ వెంట ఎంపీడీఓ శివప్రసాద్, ఎంఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, మండల అధికారులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

మునిపిరెడ్డిపల్లి..

## దశాబ్దాలుగా రోడ్డు సమస్య - పట్టించుకోని పాలకులు

# దళితవాడకు దారేటు...?

**ప్రజాశక్తి - పాకాల**

'మా రోడ్డులో గుంతలు పడ్డాయి... మరమ్మతులు చేయండి' అంటూ రాష్ట్రమంతా గగ్గోలు పెడుతున్నారు.. అయితే పాకాల మండలం చెన్నుగారిపల్లి పంచాయతీ మునిపిరెడ్డిపల్లి దళితవాడకు వారికి ఊహ తెలిసినప్పటి నుంచి రోడ్డే లేదు.. శతాబ్దాలుగా ఈ దళితవాడలో తరతరాల వారు పుడుతున్నారు.. పోతున్నారు తప్ప.. రోడ్డును మాత్రం వేయించుకోలేకపోతున్నారు.. పాలకుల వద్ద మొర పెట్టుకున్నా తమ గోడు పట్టించుకోవడం లేదన్నది వారి ఆవేదన. ఇప్పటివరకూ వాళ్ల వెళ్లే రోడ్డులో వెళ్లడానికి వీల్లేదని పెత్తందారులు అడ్డుకోవడంతో తాము ఎలా వెళ్లాలంటూ వారు వాపోతున్నారు.

ప్రధాని ఇందిరాగాంధీ హయాంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రోజుల్లో మునిపిరెడ్డిపల్లి గ్రామస్తులకు ఇంటి స్థలాలను కేటాయించి, అర్హులైన వారికి ఇళ్లు కట్టించి ఇచ్చారు. ఇళ్లయితే కట్టించి ఇచ్చారు గానీ రోడ్డును మాత్రం చూపించలేదు. మునిపిరెడ్డిపల్లి గ్రామంలో 30 కుటుంబాల వారు 160 మంది నివసించే చోట పెత్తందారులు ఉండడంతో రోడ్డును వేశారు. అయితే దళితవాడలో 70 కుటుంబాల వారు 500 మంది నివసిస్తున్నారు. అయితే వీరికి మాత్రం దారే లేదు. తాము ఓటర్లు కాదా.. తమను పాలకులు పట్టించుకోరా అని వారు ప్రశ్నిస్తున్నారు. తాజాగా తహశీల్దార్ భాగ్యలక్ష్మి దృష్టికి, ఎంఎల్ఎ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినా దాటవేస్తున్నారే తప్ప, తమ సమస్య పరిష్కారం చేయలేదని వాపోతున్నారు.

వెళ్లడానికి వీల్లేదంటూ పెత్తందారులు అడ్డుకుంటున్న రోడ్డు

రెవెన్యూ మ్యాప్ లో ఉన్న దళితుల గ్రామానికి కేటాయించిన రోడ్డు మార్గంలో సమాధులు నిర్మించిన వైనం

**మేము ఓటర్లం కాదా.. : బాలరాజు, గ్రామస్తుడు**

మా దళితవాడలో ఉండేవాళ్లం ఓటర్లం కాదా.. పెత్తందారులు మాత్రమే ఓటర్లా.. ఊరికి రోడ్డు ఉండటం ఏంటి? వాడకు రోడ్డు లేకపోవడం ఏంటి? పాలకులకు ఎందుకింత వివక్ష. మేం మనుష్యులం కాదా.. తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లాం. పట్టించుకోలేదు.

**మా దారిలో సమాధులున్నాయి : కళావతి, చెన్నుగారిపల్లి సర్పంచి**

దళితవాడకు వెళ్లే వేరే మార్గంలో సమాధులున్నాయి. పిల్లలు అటువైపు వెళ్లాలంటే భయపడుతున్నారు. పెద్దలు రాత్రుల్లో రావాలంటే ఇబ్బంది పడుతున్నారు. దళితుల గ్రామానికి రెవెన్యూ సర్వే ప్రకారం ఉన్న మార్గంలో సమాధులు ఉన్నాయి. ఇపుడు వెళుతున్న దారిలో పెత్తందారులు వెళ్లనీయడం లేదు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

**రోడ్డు సమస్య ఉండటం వాస్తవమే : భాగ్యలక్ష్మి, తహశీల్దార్**

దళితులు చెబుతున్నట్లుగా రోడ్డు సమస్య ఉన్న మాట వాస్తవమే. పూర్తిస్థాయిలో విచారణ జరిపి, అధికారులతో చర్చించి తొందరలో సమస్య పరిష్కారమయ్యేలా చూస్తాం.

## పోలీసు మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం

చెక్కును అందిస్తున్న జిల్లా ఎస్పీ రిషాంత్ రెడ్డి

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** చిత్తూరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ 27.7.2022వ తేదీన అనారోగ్యంతో మరణించిన ట్రాఫిక్ కానిస్టేబుల్ మోహన్ నాయకర్ కుటుంబ సభ్యులు అమతవల్లి, శాంతకుమారిలకు ఐడిఆర్‌ఎఫ్ ఫండ్స్ కింద లక్ష రూపాయలు, విడో ఫండ్ నుంచి రూ.50వేలు, ఫ్లాగ్‌ఫండ్ నుండి రూ.25వేలు చెక్కులను జిల్లా ఎస్పీ రిశాంత్ రెడ్డి, వి.మోహన్, అడ్మినిస్ట్రేషన్ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మతుడి కుటుంబానికి భరోసా ఇస్తూ పోలీస్ డిపార్టుమెంటు తరపున వారి కుటుంబానికి అన్నిరకాలుగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

# ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందాలి

### మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీ రెడ్డప్ప

**ప్రజాశక్తి- వికోట:** రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలను పార్టీలకు అతీతంగా అర్హులందరికీ అందచేయాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు అధికారులపై ఉందని ఎంపీ రెడ్డప్ప తెలిపారు. స్థానిక మండల పరిషత్ ప్రాంగణంలోని శ్రీశక్తి భవనంలో బుధవారం ఎంపీపీ యువరాజ్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలపరిధిలోని అన్నిశాఖల అధికారులు వారివారి ప్రగతి నివేదికలను వివరించారు. ఎంపీ మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ఇరిగేషన్ ఇంజనీరు మండలంలో ఉన్న చెరువుల స్థితిగతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నివేదికలు సమర్పించాలని ఎంపీపీ ఆదేశించారు. అంగన్వాడీ పాఠశాలల్లో పోషకాహార లోపం లేకుండా నాణ్యతా ప్రమాణాలు పాటించే విధంగా క్షేత్రస్థాయిలో ఐసిడిఎస్ అధికారులు నిరంతరం పర్యవేక్షించి మండల పరిషత్‌కు ప్రగతి నివేదికలు అందజేయాలని సూచించారు. అగ్రికల్చర్ హార్టికల్చర్ సిరికల్చర్ అధికారులు రైతులకు ప్రభుత్వ పథకాలు గురించి సంపూర్ణమైన అవగాహన కలుగచేయాలని సచివాలయాల స్థాయిలలో సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రతిరోజు సాయంత్రం స్పందన కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. ఈసందర్భంగా వీకోట మండలం మీదుగానే జాతీయ రహదారి బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని మండలంలోని అన్ని పంచాయతీల సర్పంచులతో పాటు మండల పరిషత్ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానాలు చేసి కాపీలను ఎంపీకి అందజేశారు. దీనిపై స్పందించిన వారు ఢిల్లీ స్థాయిలో తనవంతు ప్రయత్నాలు చేసి వికోట మండలం మీదుగానే జాతీయ రహదారి ఏర్పాటుకు తన వంతు కషి చేస్తానని సభ్యులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జడ్పీ ప్రత్యేక ఆహ్వానితులు గౌస్, రాష్ట్రరోడ్డు ట్రాన్స్పోర్ట్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలగురునాథ్, వైస్ ఎంపీపీలు లక్ష్మణ్ రెడ్డి, తమిమ్ ఖాన్, సింగల్ విండో ప్రెసిడెంట్లు గోపిరెడ్డి, దవనం భక్తవత్సలం, ఎంపీడీఓ బాలాజీ , తహసీల్దార్ సీతారామయ్య, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఎంపీ రెడ్డప్పకు తీర్మాన పత్రాలను అందజేస్తోన్న ఎంపీపీ యువరాజ్ , సర్పంచ్లు

## శాశ్వత పరిష్కారం చూపేలా కృషిచేయండి

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:** హౌస్ హెూల్డ్ మ్యాపింగ్‌కు సంబంధించి ప్రభుత్వం ఈనెల 9 నుంచి 11వతేదీ వరకు కొత్తపేర్లు నమోదుకు అవకాశం కల్పించిందని, ఈ మ్యాపింగ్ ప్రక్రియను త్వరితగతిన చేసేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ యం.హరి నారాయణన్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, డిఆర్ఓ ఎన్.రాజశేఖర్, ట్రైనీకలెక్టర్ వై.మేఘ స్వరూప్‌లతో కలసి వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎంపిడిఓలు, మునిసిపల్ కమిషనర్‌లతో స్పందన, గడపగడపకు మన ప్రభుత్వంలో అందిన అర్జీల పరిష్కారంపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హౌస్ హెూల్డ్ మ్యాపింగ్‌కు సంబంధించి ప్రభుత్వం ఈనెల 9 నుంచి 11వతేది వరకు కొత్తపేర్లు నమోదుకు అవకాశం కల్పించిందని వాలంటీర్లు ద్వారా ఈ మ్యాపింగ్ ప్రక్రియను క్లస్టర్ స్థాయిలో పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని, స్పందన అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా అధికారులు కషి చేయాలన్నారు. జిల్లా కేంద్రానికి స్పందన కార్యక్రమంలో తమ సమస్యల పరిష్కారం కోసం రావడం జరుగుతుందని, అధికారులు, అర్జీదారులు సమస్యలు గుర్తించి వెంటనే వారి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. అర్జీదారులకు అర్థవంతంగా శాశ్వత పరిష్కారం చూపాలన్నారు.

## కెవిపిఎస్ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

### కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు అన్నూరి ఈశ్వర్

**ప్రజాశక్తి- పలమనేరు:** కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) చిత్తూరు జిల్లా 2వ మహాసభలు ఈనెల 11వ తేదీన చిత్తూరు సిఐటియు జిల్లా కేంద్ర ఆఫీసులో నిర్వహించడం జరుగుతుందని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు అన్నూరి ఈశ్వర్ తెలిపారు. ఈ మహాసభలకు జిల్లాలోని కెవిపిఎస్ నాయకులు, కార్యకర్తలు, డప్పు కళాకారులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. బుధవారం పలమనేరు నియోజకవర్గం కెవిపిఎస్ ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అన్నూరి ఈశ్వర్ మాట్లాడుతూ కేవిపిఎస్ ఏర్పడిన నాటి నుండి అనేక సమర సుశీల ఉద్యమాలు నిర్వహించి విజయాలు సాధించిందఅన్నారు. ఎస్సీ ఎస్టీ కమిషన్ సబ్జాన్ చట్టం, కులాంతర వివాహితులకు 2.50లక్షల ప్రోత్సాహం పెంచుతూ జీవో 12, దళితులకు 2 ఎకరాల స్మశాన వాటిక స్థలం కోసం జీవో 1235, దళితులకు 101 వంద యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని జీవో నెంబర్ 342, ఎస్ఎమ్ హెచ్ కాలేజీ హాస్టల్ విద్యార్థులకు రూ.500లు ప్యాకెట్ మనీ వంటి అనేక విజయాలను కెవిపిఎస్ సాధించిందని తెలపారు. జిల్లా నలుమూలల నుండి 300మంది ప్రతినిధులు హాజరవుతారని ఈ మహాసభల జయప్రదానికి ప్రతిఒక్కరూ సహకరించవలసిందిగా కోరారు. కార్యక్రమంలో పలమనేరు డివిజన్ నాయకులు పాదం సుబ్రహ్మణ్యం, సలహాదారులు గిరిధర్ గుప్తా, ఓబుల్ రాజు, నాయకులు రాజా, జయంతి తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు స్వయంశక్తితో ఎదగాలి: డీఆర్డీఏ పీడీ

సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్డిఏ పిడి తులసి

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** మహిళలలో స్వయంగా ఆర్థికంగా నిలదొక్కునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టడం జరుగుతుందని మహిళల ఆర్థిక అభివద్ధి కోసం అనేక సంస్థలు కూడా ముందుకు రావడం ఆనందంగా ఉందని వాటిని ఉపయోగించుకుని మరింత ముందుకు మహిళలు ఎదగాలని డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ డీఎంకే తులసి అన్నారు. బుధవారం ఉదయం చిత్తూరులోని ట్రైనింగ్ సెంటర్లు సౌరశక్తితో పనిచేసే పలు పరికరాలను ఉపయోగించి జీవనోపాధి ఆలంబన చేసుకునేందుకు ఒక ప్రైవేటు సంస్థ, డిఆర్డిఏలో సంఘసభ్యులకు అవగాహన కల్పించేందుకు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ మహిళలు సౌరశక్తి ద్వారా తక్కువఖర్చుతో పలు యంత్రాలను ఉపయోగించుకొని ఆర్థికంగా అభివద్ధి చెందవచ్చునని అందులో ప్రధానంగా పాలు పితికే యంత్రం, కుండల తయారీ యంత్రం, కుట్టు పని యంత్రం, రోటి తయారు చేసే యంత్రం, పిండి తయారీ యంత్రం, తాడు తయారు చేసే యంత్రం, ఫోటో కాఫీ తయారు చేసే యంత్రం, పిండిమిల్లు యంత్రం, సౌరశక్తితో నీటివ్యవస్థ, హైడ్రోఫోరెన్సిక్, సౌర శక్తితో పంటలకు స్ప్రే చేసే యంత్రాల గురించి డెమో కార్యక్రమం మహిళలకు ఇప్పించారు. ఈ సందర్భంగా పిడి మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలంటే అందుకు కావాల్సిన యంత్రాలు అవసరమని తక్కువ ఖర్చుతో ఎక్కువ ఉత్పత్తుల విలువ చేసే యంత్రాలను పొందడం ద్వారా మహిళలు ఆర్థికంగా అభివద్ధి చెందవచ్చునని అన్నారు. ఇందుకు సంబంధించి జిల్లాస్థాయిలో మొదట అవగాహన కల్పించడం జరుగుతుందని రానున్న కాలంలో క్షేత్రస్థాయిలో వీరికి అవగాహన కల్పించి యంత్రాల వైపు మొగ్గచూపేలా చేయడం జరుగుతుందని అన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో పథకాలను మహిళల ఆర్థిక అభివద్ధి కోసం ప్రవేశపెట్టడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో ఏపీఎంలు, ఇతర సిబ్బంది, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి- పెద్దపంజాణి:** గ్రామాల్లో అర్హులైన లబ్ధిదారులు ప్రభుత్వపథకాలను సద్వినియోగం చేసుకోవాలని పలమనేరు నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ ఎన్.వెంకటేగౌడ అన్నారు. బుధవారం కోగిలేరు పంచాయతీలో నిర్వహించిన గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రమేష్ బాబు, మండల కన్వీనర్ బాగారెడ్డి ఆధ్వర్యంలో చికులదిన్నెపల్లె, పొట్టగానిపల్లి, కోగిలేరు గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఈసందర్భంగా గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తూ, అర్హులైన లబ్ధిదారులకు మంజూరు కాకుంటే ఆ సమస్యను వెంటనే పరిష్కరిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎన్.రెడ్డెప్ప, జడ్పీటీసీ సుష్మకీర్తి, ఎంపీడీవో భాస్కర్, తహశీల్దార్ హనుమంతు, సింగల్ విండో ఛైర్మన్ శంకరప్ప, వైస్‌ఎంపీపీ జీడి బాబు, ఆంజమ్మ పాల్గొన్నారు.

## ఫీల్డు అసిస్టెంట్‌పై చేసిన ఫిర్యాదు అవాస్తవం

### ఏపీడీ శోభన్ బాబు

**ప్రజాశక్తి- కార్వేటినగరం:** మండల పరిధిలోని ఆర్కేవీబీపేట పంచాయతీలోనే ఫీల్డు అసిస్టెంట్‌పై కొందరు చేసిన ఫిర్యాదు అవాస్తంగా తేలిందని నగరి ఏపీడీ శోభన్ బాబు తెలిపారు. కొద్ది రోజుల క్రితం రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయానికి కొందరు పీల్డు అసిస్టెంట్‌పై ఫిర్యాదు చేయడంపై బుధవారం గ్రామంలో కూలీలతో స్థానిక సర్పంచ్ దివ్య ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ ఫీల్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గోవిందస్వామిపై గిట్టనివారు ముఖ్యమంత్రి కార్యాలయానికి కూలీలు లేకపోయినా మస్టర్ వేస్తున్నట్లు, అదేవిధంగా ప్రతిఒక్కరి వద్ద రూ.50లు వసూలు చేస్తున్నట్లు, బినామీ పేర్లతో మస్టర్లు నమోదు చేస్తున్నట్లు, పాత పనులను కొత్త పనులుగా చిత్రీకరిస్తున్నట్లు ఇచ్చిన ఫిర్యాదుపై కూలీలతో, గ్రామస్తులతో విచారణ చేపట్టగా ఆది ఆవాసమైన అభియోగమని కూలీలు నిర్ధారించారని తెలిపారు. ఇలాంటి ఎప్పుడు తమ పంచాయతీలో చోటుచేసుకోలేదని వివరించారని ఏపీడీ వెల్లడించారు. ఇలాంటి నిరాధారమైన ఫిర్యాదులు చేస్తే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మోహన మురళీ, ఏపీవో జాహ్నవి, కార్యదర్శి లోకేష్, ఈసీ మధు, మోహన్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ లోకేష్, కూలీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## 14న అప్రెంటిస్‌షిప్ మేళా

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** ఈనెల 14వ తేదీ స్థానిక చిత్తూరు ప్రభుత్వ ఐటిఐ ఉదయం 9గంటల నుంచి అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్ రవీంద్రారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు ఐటిఐలో వివిధ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు ఈమేళాలో పాల్గొనాలని కోరారు. జిల్లాలోని ప్రముఖ కంపెనీలు అప్రెంటిస్‌షిప్ చేసే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈఅవకాశాన్ని ఐటిఐ పూర్తిచేసిన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

# జిల్లా న్యాయ సేవాసదన్ ఏర్పాటు

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:** న్యాయపరమైన సేవలు, ప్రభుత్వం అందించే సేవలు ప్రజలకు అందించాలన్నదే జాతీయ, రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ముఖ్య ఉద్యేశమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావ్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ఎస్టేట్‌లో ఉన్న జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ఐ.కరుణ కుమార్, అదనపు జిల్లా జడ్జి శాంతి, అదనపు జడ్జి శ్రీనివాసులు, రాజశేఖర్ రెడ్డిలతో కలిసి న్యాయసేవ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సామాజిక అభివద్ధికి సంబంధించిన చట్టాలు, సమాజ అభివద్ధికి ప్రభుత్వం చేస్తున్న అనేక కార్యక్రమాలను గ్రామస్థాయి ప్రజల వద్దకు తీసుకొనిపోవడమే జాతీయ న్యాయసేవ అధికార సంస్థ ముఖ్యఉద్యేశమని తెలిపారు. 1 నవంబర్ నుండి 13 వరకు జిల్లావ్యాప్తంగా హక్కు హమారా బి హాయ్ అనే కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంకు ముందు ఎస్టేట్‌లోని జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చట్టాలపై, స్త్రీ శిశుసంక్షేమ శాఖ, వైద్యఆరోగ్య శాఖ, ఉద్యాన వన శాఖలు ప్రజలకు అందించే సేవలపై ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను జిల్లా జడ్జి ప్రారంభించారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి డాక్టర్ ఐ.అరుణ్ కుమార్, జైల్ పర్యవేక్షకులు యం.వేణుగోపాల్‌రెడ్డి, న్యాయవాదులు, సైదా జామా, కోర్టు సిబ్బంది, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.ఆనంద రెడ్డి, ఎస్ఐ టి.ప్రకాష్, జైల్ వార్డెన్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు

## గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:** జిల్లా కలెక్టర్ ఎం.హరినారయణన్ బుధవారం పూతలపట్టు నియోజవర్గంలో జరుగుతున్న గృహనిర్మాణ పనులకు సంబంధించి క్షేత్రస్థాయి ఉద్యోగులతో పాటు సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో మొత్తం 11302 గహనిర్మాణ పనులకు మంజూరు ఇవ్వగా 2000 గహాలు బిబిఎల్ కన్నా తక్కువస్థాయిలో ఉన్నాయని అందులో వెంటనే బిబిఎల్ పై స్థాయికి వెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వారంవారం నిర్దేశించుకొన్న లక్ష్యాలను చేధించాలన్నారు. లక్ష్యాల సాధనకు లబ్ధిదారులతో సంప్రదించి వేగంగాపనులు నిర్వహించాలన్నారు. ఈసందర్భంగా లక్ష్య సాధనలో వెనుకబడిన వారిని పనితీరును మెరుగుపరుచుకోవాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, హౌసింగ్ పిడి పద్మనాభం, హౌసింగ్ అధికారులు, ఎంపిడిఓలు, గ్రామ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## స్థానిక సమస్యలు గుర్తించేందుకే..

### గడప గడపకూ మన ప్రభుత్వం : ఎమ్మెల్యే ఎమ్మెస్ బాబు



**ప్రజాశక్తి- బంగారుపాళ్యం:** స్థానిక సమస్యలను గుర్తించేందుకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపడుతున్నట్టు పూతలపట్టు శాసనసభ్యులు ఎమ్మెస్.బాబు తెలిపారు. బుధవారం మండలంలోని తుంబకుప్పం సచివాలయంలో పెరుమాలపల్లి పంచాయతీలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలోని స్థానిక సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకనిధులు రూ.20లక్షలు మంజూరు చేసిందని, సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఉద్దేశ్యంతో కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. గ్రామంలోని సిసి రోడ్లు, మురుగునీటి కాలువ నిర్మాణం, పలు సమస్యలను గుర్తించామని వీటిని అతి త్వరలో పూర్తిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అమరావతి, జడ్పిటిసి వైస్‌ఎంపీపీ శిరీష్‌రెడ్డి సోమశేఖర్, సింగల్ విండో ఛైర్మన్ దత్తరెడ్డి, కోఆప్షన్ నెంబర్ ఫిరోజ్ అహ్మద్, తహశీల్దార్ బెన్‌రాజ్, పాల్గొన్నారు.

## తహశీల్దార్ పై జెసి విచారణ

**ప్రజాశక్తి- ఎస్ఆర్‌పురం:** ఎస్ఆర్‌పురం తహశీల్దార్ కార్యాలయంలో అక్రమాలకు పాల్పడుతున్న తహశీల్దార్‌పై కొందరు బాధితులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు తహశీల్దార్ కార్యాలయంకు వచ్చి విచారణ చేపట్టారు. మండలంలోని పంచాయతీలో ఉన్న డికెటి భూములకు సెటిల్మెంట్ పట్టాలను రెవెన్యూ సిబ్బంది ద్వారా ఇప్పిస్తున్నారని కొందరు బాధితులు ఆరోపించడంతో విచారణలో నిజానిజాలు బయటకు వస్తున్నాయి. తహశీల్దార్ కార్యాలయంలో తమ సమస్యలను చెప్పుకోవడానికి వచ్చిన వారిని అసభ్య పదజాలంతో బయటికి వెళ్లమంటూ కసురకుంటున్నాడని స్పంచులు జెసికి వివరించారు. జెసి విచారణ చేపట్టి పూర్తి వివరాలను పైస్థాయి అధికారులకు పంపుతామని తెలిపారు. అనంతరం పలు భూ రికార్డులను పరిశీలించారు.

## రబీ సీజన్‌కు ప్రణాళిక సిద్ధం

**ప్రజాశక్తి- గుడిపల్లి:** ఈ రబీ సీజన్‌కు రైతులకు కావల్సిన రసాయన ఎరువులు రైతు భరోసాకేంద్రంలో సిద్ధంగా ఉన్నాయని, రైతుల వసరాన్ని బట్టి ఆర్‌బికెల్లో ఉంచుతామని మండల వ్యవసాయ అధికారి నాగరాజు తెలిపారు. బుధవారం స్థానిక ఆర్‌బికెలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు బాగా పడటం వలన నీళ్లు బాగా ఉన్నాయని, కనుక ఈ రబీ సీజన్‌లో కూడా దాదాపుగా వరి 795 ఎకరాలు, రాగులు 286 ఎకరాలు, ఉలవలు 213 ఎకరాలు, ఇతర కూరగాయ పండ్ల తోటలు, మల్బరి పంటలు రైతుల వేసుకునే అవకాశం ఉందని తెలిపారు. అలాగే గత ఖరీఫ్‌సీజన్‌లో లాగా ఈ రబీసీజన్లో కూడా ఈ నెల చివరి నుంచి ఈ పంట నమోదు ప్రారంభమయ్యే అవకాశం ఉందని కచ్చితంగా పంట వేసిన ప్రతి రైతు కూడా సంబంధిత రైతు భరోసా కేంద్రంలో ఈ పంట నమోదు చేసుకుంటేనే ప్రభుత్వం ద్వారా అందే వివిధరకాల పథకాల లబ్ది పొందగలరని తెలిపారు. అంతేకాకుండా కూరగాయల నారు కావల్సిన రైతులు 30 రోజులు ముందుగానే ఆర్‌బికెల ద్వారా కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ వద్ద ఉన్న సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో నమోదు చేసుకుని ప్రభుత్వం రాయితీ ద్వారా అందజేసే నారలు పొందాలని ఉద్యాన అధికారి డింపు ప్రియశ్రీ తెలిపారు. మన వాతావరణం, మల్బరీ పంటకు పట్టుపురుగుల పెంపకానికి చాలా అనుకూలమని కావున ఆసక్తి ఉన్న రైతులందరూ కూడా కొత్తగా మల్బరీ నాటుకుని పట్టుపురుగులు పెంపకానికి అవసరమైన షెడ్లు నిర్మించుకోవచ్చు అని, ప్రభుత్వం ద్వారా అందజేసే రాయితీ కూడా పొందవచ్చునని పట్టు పరిశ్రమ అధికారి శ్రావణి తెలిపారు.

## బాలికల ఉన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞానసదస్సు

**ప్రజాశక్తి- పలమనేరు:** పలమనేరు మండలంలోని జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం మండల న్యాయ సేవా అధికార సంస్థ, పలమనేరు జూనియర్ సివిల్ జడ్జి రాహుల్ అంబేద్కర్, మండల విద్యాశాఖ అధికారిని లీలారాణి ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈకార్యక్రమంలో మహిళా సాధికారత పెంపొందించడం గురించి వ్యాసరచన, ఉపన్యాసాల పోటీలు నిర్వహించారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులు జూనియర్ సివిల్‌జడ్జి అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుజాత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న జూనియర్ సివిల్ జడ్జి

## మాతా శిశు మరణాలపై దృష్టి సారించండి

**ప్రజాశక్తి- యాదమరి:** మాతా శిశుమరణాలను నిర్మూలించేందుకే గ్రామీణ ప్రాంతాల్లో వ్యాధినిరోధక టీకాలు కార్యక్రమాన్ని ప్రారంభించారని యాదమరి కమ్యూనిటీ హెల్త్‌ఆఫీసర్ లక్ష్మీనారాయణ తెలిపారు. బుధవారం యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మోర్దానపల్లి ఉప ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిహెచ్ఓ మాట్లాడుతూ మాతా శిశు మరణాలు జరగకుండా చూసేందుకే ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. గర్భవతులు చిన్నారులకు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధకటీకాలు 100శాతం వేయించాలన్నారు. అలాగే ప్రతి గర్భిణి ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పు అయ్యేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పు సురక్షితమని కాన్పు సమయంలో తల్లీబిడ్డకు ఎలాంటి ఇబ్బందీ తలెత్తిన మెరుగైన వైద్యం అందించి ప్రాణాపాయం నుండి వారిని కాపాడతారని వివరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ లక్ష్మీపతి, ఎంఎల్‌హెచ్‌పి సాయిలక్ష్మి, మహిళా ఆరోగ్యకార్యకర్త విమల, ఆశాకార్యకర్తలు మునిలక్ష్మి, అనసూయ పాల్గొన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ

## పేదలకు అన్నదానం

**ప్రజాశక్తి - గంగాధర్ నెల్లూరు:** వైసీపీ ప్రభుత్వం పోలీసులు అడ్డం పెట్టుకొని రాష్ట్రంలో టిడిపి నేతలపై అక్రమకేసులు బనాయిస్తోందని నియోజకవర్గ టిడిపి కోఆర్డినేటర్ భీమనేని చిట్టిబాబు నాయుడు ధ్వజమెత్తారు. గంగాధర నెల్లూరులో అన్న క్యాంటీన్ ప్రారంభించి 35వ రోజు సందర్భంగా దాతలు చల్లగుండ్ల దీపక్ నాయుడు కుమార్తె కీర్తనకు, అలాగే ఎగువుపల్లాలు చెందిన వెంకటరమణారెడ్డికి పుట్టినరోజు సందర్భంగా బుధవారం పేదలకు దాతలతో కలిసి చిట్టిబాబు నాయుడు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వెంకటేష్, శ్రీధర్ యాదవ్, స్వామిదాస్, లోకనాథ్‌రెడ్డి, దేవసుందరం, జ్యోతీశ్వర్ రెడ్డి, నటరాజ్ మొదలి, శాంతకుమార్, కొత్తపల్లి శంకర్, లోకనాథ నాయుడు, గిరిబాబు రెడ్డి, వెంకటేష్ యాదవ్, బుజ్జిబాబు, కమల్ పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం చేస్తున్న చిట్టిబాబు నాయుడు

## పాడి పశువులకు టీకాలు..

**ప్రజాశక్తి- రామకుప్పం:** పశువులకు వ్యాధులు రాకుండా పాడిరైతులు ముందస్తు జాగ్రత్తగా టీకాలు వేయించాలని రామకుప్పం జడ్‌పిటిసి సభ్యుడు నితిన్ రాఘవరెడ్డి సూచించారు. బుధవారం మండల పరిధిలోని మిట్టపల్లిలో రామకుప్పం పశువైద్య డాక్టర్ రవిశంకర్ ఆధ్వర్యంలో గ్రామంలో పశువులకు లంపి ముద్దు చర్మవ్యాధి నిరోధక టీకాలు 226 పశువులకు వేశారు. అలాగే పశువుల పట్ల తీసుకోవల్సిన జాగ్రత్తలను పాడి రైతులకు సూచించారు.

**పెద్దపంజాణి:** పశువులకు వస్తున్న ముద్ద చర్మవ్యాధి నివారణకు ముందస్తు జాగ్రత్తగా టీకాలు వేస్తున్నట్లు సుధానిధి, స్థానిక సర్పంచ్ శిరీష నాగ శంకర్ రెడ్డి అన్నారు. కరసనపల్లి పంచాయతీలో బుధవారం ఉచిత పశువైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పాడిపశువులకు బ్యోటాక్స్ స్ప్రే చేయడం, లేగదూడలకు నట్టల నివారణ మందులను ఇంజక్షన్ వేశారు.

# వి.కోట బైపాస్ సాధనకు వామపక్షాల మద్దతు

**ప్రజాశక్తి- వికోట:** మూడు రాష్ట్రాల కూడలి అయిన వికోట మండలం మీదుగానే బైపాస్ రోడ్డు వెళ్లాలన్న ప్రతిపాదనతో ఏకీభవిస్తూ అఖిలపక్షం జెఎసికి వామపక్ష, ప్రజాసంఘాల తరపున మద్దతు తెలుపుతున్నట్లు జిల్లా సిపిఎం కార్యవర్గ సభ్యురాలు భువనేశ్వరి తెలిపారు. జేఏసీ గత 14రోజులుగా చేపట్టిన నిరసన కార్యక్రమానికి బుధవారం సీఐటీయూ అనుబంధ సంఘాల అధ్వర్యంలో వివిధ కార్మిక ప్రజాసంఘాలు తమ సంఘీభావం తెలుపుతూ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ వీకోట మండలం మీదుగా వెళ్లే బైపాస్ రోడ్డును కర్నాటక రాష్ట్ర నేతలు హైజాక్ చేశారని ఆరోపించారు. మండలం నుంచి ఎన్నికైన ప్రజాప్రతినిధులు, పొరుగు రాష్ట్రానికి లబ్ధిచేకూరేలా హైవే అధికారులు వ్యవహరిస్తుంటే మిన్నకుండటం పట్ల వారు ఆందోళన వ్యక్తం చేశారు. మంజూరైన బైపాస్ రోడ్డు వి.కోటకు లబ్ధిచేకూరేలా ఉండాలే తప్పా పొరుగు రాష్ట్రానికి లబ్ధి చేకూరేలా ఉండరాదని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘంనేత ఓబుల రాజు తెలిపారు. బైపాస్ రోడ్డు సాధన నిమిత్తం జెఏసీ గ్రామగ్రామాన ప్రజలను చైతన్య పరిచేందుకు చేపట్టే కార్యక్రమాల్లో తమవంతు సహాయ సహకారాలందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సీఐటీయూ కార్యదర్శి అనితా, నేతలు శ్యామల, జీవిత, అంగన్వాడీ ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన డీఎస్పీ

**ప్రజాశక్తి - గంగాధర్‌నెల్లూరు:** మండల కేంద్రమైన పోలీస్‌స్టేషన్ డీఎస్పీ శ్రీనివాసమూర్తి తనిఖీ చేశారు. రెండు రోజుల క్రితం డీఎస్పీలు బదిలీల భాగంగా చిత్తూరు డిఎస్పీగా శ్రీనివాస్ మూర్తి బాధ్యతలు స్వీకరించిన తరువాత బుధవారం సాయంత్రం గంగాధర నెల్లూరు స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీనివాసరావు వద్ద మండలంలో ఏఏ కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నాయి, వాటిలో ఎన్ని పరిష్కారం అయ్యాయి ఇంకా ఎన్ని పండింగ్ ఉన్నాయి అని వివరాలను అడిగి తెలుసుకున్నారు. డీఎస్పీగా బాధ్యతలు తీసుకున్న మొదటిసారి గంగాధర నెల్లూరుకు విచ్చేసినందుకు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిన్నమ్మ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.

రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసమూర్తి

## చిరుధాన్యాల ఆవశ్యకతపై రైతులకు క్షేత్ర సందర్శన

**ప్రజాశక్తి- సోమల:** మండలంలోని తమ్మినాయునిపల్లి పంచాయతీ పగడాల వారిపల్లి గ్రామంలో వాసన్ సంస్థ సభ్యులు 20రకాల వరి, 40 రకాల మినుములు, 15 రకాల రాగి దేశవాళి పంటలను బయోడైవర్సిటీ బ్లాక్‌ల ద్వారా పండించి అందులోని పలు రకాల గురించి రైతులకు అవగాహన కల్పించి అనంతరం వారికి ధాన్యాలను అందజేశారు. ఈ సందర్భంగా వాసన్ సంస్థ సభ్యులు మాట్లాడుతూ చిరుధాన్యాల పంటలకు ఎటువంటి క్రిమిసంహారక మందులు వాడరాదని, ఈ ధాన్యాలను తినడం వల్ల వద్దులు పిల్లలు ఆరోగ్యంగా ఉంటూ బలవర్ధక ఆహారంగా ఉపయోగపడతాయని రైతులకు తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కూడా 2023వ సంవత్సరాన్ని చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించడం, దీనివల్ల రైతులు పండించే చిరుధాన్యాలకు బహిరంగ మార్కెట్లో మంచి ధర పలికి రైతులు లాభాలు గడించే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కందూరు, తమ్మినాయునిపల్లి సర్పంచులు బాష మసూద్, సురేంద్రరెడ్డి, ఏపీ సీఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**ప్రజాశక్తి- పులిచెర్ల:** ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇంచార్జ్ చల్లా రామచంద్రారెడ్డి తెలిపారు. మండలంలోని కమ్మపల్లిలో బుధవారం మండలస్థాయి టీడీపీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈసమావేశంలో చల్లా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని టీడీపీ కార్యకర్తలను కంటికిరెప్పలా కాపాడుకునే బాధ్యత తనదన్నారు. చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యంగా పార్టీకి కార్యకర్తలు చిత్తశుద్ధితో సేవలందించాలన్నారు. నాయకుల మధ్యనున్న చిన్నచిన్న బేధాభిప్రాయాలను పక్కనబెట్టి బూత్ లెవల్ స్థాయి నుండి కేడర్ ను పటిష్టపరిచేందుకు ఏకం కావాలన్నారు. పార్టీఅధినేత చంద్రబాబు, యువనేత లోకేష్ పై అనేక అక్రమకేసులు పెట్టినా భయపడకుండా అలుపెరుగని పోరాటం చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. అనంతరం పంచాయతీల వారీగా బూత్‌లెవల్ కమిటీలను ఏర్పాటు చేశారు. రాష్ట్ర బూట్ కమిటీ పరిశీలకుడు చలపతినాయుడు, నాయకులు రామనాథం నాయుడు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న చల్లా రామచంద్రారెడ్డి

# క్రైం న్యూస్

## చోరీ కేసులో నిందితులు అరెస్టు

**ప్రజాశక్తి- బంగారుపాళ్యం:** చోరీ కేసులో నిందితులను అరెస్ట్ చేసినట్టు సీఐ నరసింహారెడ్డి తెలిపారు. మండలంలోని మొగిలి గ్రామం వద్ద పలమనేర్ పాత పేటకు సూరిబాబు, లక్ష్మీనగర్ కాలనీకి చెందిన యశ్వంత్ సాయి, గద్దూరు కాలనీ చెందిన అజిత్‌ని మొగిలి వద్ద అదుపులోకి తీసుకొని విచారించారు. విచారణలో నిందితులు గతంలో నందిని ప్లాజా వద్ద బస్సులో చోరీ చేసినట్లు అంగీకరించారు. దీంతో వారి నుంచి రూ.13లక్షల స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మల్లికార్జునరెడ్డి, పోలీసులు ధనంజయ నాయుడు, దామోదరం నాయుడు, ముబారక్, బెనర్జీరావు, నీరజాక్షలు హోంగార్డ్ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## అగర మంగళం వద్ద వ్యాన్ బోల్తా

**ప్రజాశక్తి గంగాధర్ నెల్లూరు:** బాలగంగనపల్లె - గంగాధర నెల్లూరు ప్రధాన రహదారి అగర మంగళంకు సమీపంలో వ్యాన్ బోల్తాపడి 6 మందికి గాయాలైన సంఘటన బుధవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన స్థానికులు తెలిపిన వివరాల మేరకు ఇలా ఉన్నాయి. గంగాధర నెల్లూరు మండలం అగరమంగళం పంచాయతీ ద్వారకా నగరంలో వద్ధురాలు మరణించింది. ఆమె మరణవార్త తెలుసుకొని వారి బంధువులైన యాదమరి మండలానికి చెందినవారు పలువురు వ్యాన్‌లో సుమారు 30మంది ద్వారకనగరానికి వస్తుండగా అగర మంగళహారానికి సమీపంలో తారు రోడ్డు ధ్వంసం కావడాన్ని డ్రైవర్ సరిగా గుర్తించకపోవడంతో వ్యాన్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆరు మందికి గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని గంగాధరనెల్లూరు పీహెచ్సీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు.

## ఆర్టీసీ బస్సును ఢీకొన్న బైక్

**ప్రజాశక్తి- కార్వేటినగరం :** ఆర్టీసీ బస్సును ద్విచక్రవాహనం ఢీకొని ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలైన సంఘటన బుధవారం సాయంత్రం పచ్చికాపల్లం రోడ్డులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా... కార్వేటినగరం నుంచి తిరుపతికి వెళ్లుతున్న ఆర్టీసీ బస్సును కార్వేటినగరంకు చెందిన బాలాజీ కుమారుడు బీ.నాగరాజు పచ్చికాపల్లం నుంచి కార్వేటినగరానికి వస్తూ పచ్చికాపల్లం రోడ్డులోనే జగనన్న కాలనీ వద్ద ఎదురుగా ఢీకొనడంతో గాయాలయ్యాయి. దీంతో స్థానికులు వెంటనే గాయపడిన నాగరాజును ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. స్థానికులు ఇచ్చిన సమాచార మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## గర్భిణులకు వైద్యపరీక్షలు

**ప్రజాశక్తి- సోమల:** మండలంలోని కందూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్ష మాతత్వ అభయాన్ కార్యక్రమం కింద పలువురు గర్భిణీస్త్రీలను పరీక్షించి సూచనలు సలహాలను అందజేశారు. వైద్యాధికారులు విజయలక్ష్మి, నీలిమ 34మంది గర్భిణీ స్త్రీలను పరీక్షించి ఆహార నియమాలు పాటించాలని పుష్టికరమైన ఆహారాన్ని తీసుకోవాలని ఎప్పటికప్పుడు ప్రభుత్వ వైద్యశాలలలో పరీక్షలు చేయించుకొని వైద్యుల సలహాలు సూచనలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**రొంపిచెర్ల:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం వైద్యాధికారి డాక్టర్ జయశ్రీ ఆధ్వర్యంలో ప్రతినెలా ప్రధానమంత్రి సురక్షిత మాతత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జయశ్రీ మాట్లాడుతూ గర్భిణులందరికి రక్తహీనత కలగకుండా తీసుకోవాల్సిన ఆహార పద్ధతులను వివరించారు. అలాగే రోజుకు రెండు ఐరన్ మాత్రలు తప్పనిసరిగా వేసుకోవాలని సూచించారు. మండల ఆరోగ్య విద్యాధికారి ఎం.రాజేశ్వరి, సిహెచ్ఓ కాంతమ్మ, పిహెచ్ ఎన్.పార్వతమ్మ,ఎం ఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలలు పాల్గొన్నారు.

## గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

**ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి:** స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి నెలా 9వ తేదీన స్థానిక వైద్యనిపుణలతో గర్భిణులకు పరీక్షలు నిర్వహిస్తారు. బుధవారం మహతి పౌండేషన్ ఛైర్మన్ ఎన్ఆర్ఐ నాగరాజు 96 మంది గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులకు పౌష్టిక ఆహారం తీసుకోవడం వలన తల్లీబిడ్డ క్షేమంగా ఉంటరాని, ప్రతి తల్లి ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనివ్వడంతో పాటు మాతాశిశు మరణాలు తగ్గుతాయని తెలిపారు. అనంతరం గర్భిణులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పౌండేషన్ సభ్యులు శ్రీనివాసులు, రవి, చిన్నపయ్య, సరపన, డాక్టర్ విజయచంద్రన్, షాలినీ, హెల్త్ ఎడ్యుకేటర్, ఏఎన్ఎంఎస్, ఆశా వర్కర్లు, 108 సిబ్బంది రవిశంకర్, శిల్పా, హేమాగిరి, సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు సూచనలు ఇస్తున్న మహతి ఫౌండేషన్ ఛైర్మన్ నాగరాజు

# సంక్షిప్త వార్తలు

## వాలంటీర్ కుటుంబానికి ఆర్థికసాయం

**ప్రజాశక్తి- వెదురుకుప్పం:** ఇటీవల మండలంలోని బొమ్మయపల్లి పంచాయతీలో గ్రామ వాలంటీర్‌గా పనిచేస్తున్న వంశీ విద్యుత్ షాక్‌తో మతి చెందిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో వాలంటీర్ వంశీ కుటుంబానికి ప్రభుత్వం ద్వారా ఐదు లక్షలు ఎక్స్‌గ్రేషన్ మంజూరు అయ్యింది. అలాగే మండల వ్యాప్తంగా ఉన్న సచివాలయ ఉద్యోగులు తమ వంతు సాయంగా రూ.30వేలు ఆర్థిక సాయం బుధవారం వంశీ కుటుంబ సభ్యులకు అందజేశారు.

## వాహనాల వేలంపాటలో ఆదాయం

**ప్రజాశక్తి- పలమనేరు:** పలమనేరు ఆర్‌టిఓ పరిధిలో వివిధ కేసులలో నమోదైన వాహనాలను బుధవారం పట్టణంలోని ఆర్టీసి డిపో వర్క్‌షాప్‌లో డిటిసి బసిరెడ్డి ఆధ్వర్యంలో 26 వాహనాలను బహిరంగ వేలం నిర్వహించినట్లు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ మధుసూదన్ తెలిపారు. ఇందులో లారీలు 4, కార్లు 4, ద్విచక్ర వాహనాలు 10, లగేజీ ఆటోలు 8 వాహనాలకు వేలం నిర్వహించగా రూ. 11.25 లక్షల ఆదాయం చేకూరినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్టిఓ సిబ్బంది, వేలం దారులు పాల్గొన్నారు

## ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా బాబు

**ప్రజాశక్తి- గంగాధర్ నెల్లూరు :** పాలసముద్రం మండలంలో రెగ్యులర్ తహశీల్దార్‌గా పనిచేస్తున్న కె.బాబుని గంగాధనెల్లూరు మండలానికి ఇంచార్జ్ తహశీల్దార్‌గా రెవెన్యూ ఉన్నతాధికారులు నియమించారు. ఈమేరకు బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జి తహశీల్దర్‌గా బాబు బాధ్యతలు స్వీకరించారు.

ఎమ్మెల్సీ ఓటుకు అర్హులైన అందరూ

## ఓటు హక్కును వినియోగించుకోవాలి

**ప్రజాశక్తి- పూతలపట్టు:** ఎమ్మెల్సీ ఎలక్షన్‌లో అర్హులైన అందరూ ఓటు హక్కును నమోదు చేసుకొని ఓటు హక్కును వినియోగించుకోవాలని నినాదాలు చేస్తూ పూతలపట్టు వీధుల్లో ర్యాలీ నిర్వహిచారు. స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మానవహారంగా ఏర్పడి ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ విజయభాస్కర్, ఎంపీడీఓ గౌరీ, ఎంఈఓ కష్ణారెడ్డి, స్థానిక వైసీపీ నాయకులు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## దంతాల సంరక్షణతోనే ఆరోగ్యం..

హరిప్రియ దంత సంరక్షకులు గణేష్ రెడ్డి

**ప్రజాశక్తి - బంగారుపాళ్యం:** దంతాల సంరక్షణతోనే ఆరోగ్యమని చిత్తూరు హరిప్రియ దంత సంరక్షకులు గణేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పివిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి మురళి ఆధ్వర్యంలో వాలంటీర్లకు ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా దంత వైద్యులు గణేష్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిమనిషికి దంతాల సంరక్షించుకోవాలని, దంత సమస్య వచ్చినప్పుడు దంత వైద్యుల ద్వారా పరీక్షలు చేసుకుని చికిత్సలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మురళీకష్ణ వైద్యులు భాగ్యలక్ష్మి, రవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మురళి పాల్గొన్నారు.

## డీఈఓకు శుభాకాంక్షలు తెలిపిన ఎస్టీయు బృందం

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** నూతనంగా నియమించబడిన ఇన్‌ఛార్జి డీఈఓ విజయేంద్రరావును ఎస్టీయూ నాయకులు బుధవారం డీఈఓ కార్యాలయంలో కలిసి శు భాకాంక్షతు తెలిపారు. అనంతరంఉపాధ్యాయుల ప్రమోషన్లు, ప్రభుత్వ విద్యావ్యవస్థ బలోపేతం, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కషి చేయాలని డీఈవోని కోరారు.

## పోలింగ్ కేంద్రాల పరిశీలన

**ప్రజాశక్తి- సోమల:** మండలంలో ఎమ్మెల్సీ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎన్నికల నిర్వహణకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలను తహశీల్దార్ శ్యాంప్రసాద్ రెడ్డి బుధవారం సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

## అధికారుల తనిఖీలు

నాడు నేడు పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

**ప్రజాశక్తి- సోమల:** మండల అభివృద్ధి అధికారి నాగరాజు, మండల తహశీల్దార్ శ్యాం ప్రసాద్‌రెడ్డిలు బుధవారం పలు పాఠశాలలలో జరుగుతున్న నాడు-నేడు అభివద్ధి పనులను, మధ్యాహ్న భోజనాన్ని, సచివాలయాలను తనిఖీ నిర్వహించారు. నెల్లిమంద పంచాయతీలో ఎగువపల్లి, చింతలవారిపల్లి నెల్లివంద పాఠశాలలను ఎంపీడీవో తనిఖీ చేశారు. అలాగే అన్నెమ్మగారిపల్లి సచివాలయాన్ని తహశీల్దార్ తనిఖీ చేసే రికార్డులను పరిశీలించారు. వీరి వెంట సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## వారపు సంతలో వ్యర్థాల తొలగింపు

**ప్రజాశక్తి- సోమల:** మండల కేంద్రమైన సోమలలోని వారపు సంతలో వ్యర్థాలను పంచాయతీ కార్యదర్శి సుధాకర్ కుమార్, ఈఓఆర్డి గఫూర్, మాజీ ఎంపీటీసీ రమణయ్య ఆధ్వర్యంలో తొలగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. వారపుసంతలో వ్యర్థాలు పేరుకుపోవడం కొనుగోలుదారులకు వ్యాపారస్తులకు తీవ్ర ఇబ్బందికరంగా మారడంతో ఎట్టకేలకు వ్యర్థాలను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. అదేవిధంగా వ్యాపారస్తులకు వినియోగదారులకు త్రాగునీటి సౌకర్యాన్ని కూడా కల్పించాలని మరుగుదొడ్లు ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలని వ్యాపారస్తులు వినియోగదారులు పంచాయతీ వారిని కోరుతున్నారు.

## మురుగునీటి కాల్వలు శుభ్రం

**ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి:** మండలంలోని చప్పిడిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని జంగాల అగ్రహారం గ్రామంలో డ్రైనేజ్ కాలువల్లో గత కొంతకాలంగా పేరుకుపోయిన వ్యర్థాలను బుధవారం సర్పంచ్ విజయ చూసి వెంటనే పంచాయతీ సిబ్బందికి తెలిపి పారిశుధ్య కార్మికుల సహాయంతో డ్రైనేజీ కాలువలు శుభ్రం చేయించారు. అనంతరం కాలువలో పేరుకుపోయిన మట్టిని ట్రాక్టర్ల సహాయంతో తరలించారు. పంచాయతీ కార్యదర్శి సదాశివయ్య, వార్డు మెంబర్లు, గ్రామ వార్డు వాలంటీర్లు పాల్గొన్నారు.

కాలువల్లో పూడికలు తీస్తున్న పారిశుధ్య కార్మికులు